క్లుప్తంగా

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి


హరినాథరెడ్డి (ఫైల్)

చింతకొమ్మదిన్నె : మండలంలోని మామిళ్ళపల్లి దళితవాడ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న హరినాథరెడ్డి ఆదివారం గుండెపోటుతో మృతి చెందినట్లు ఎంఈఓ వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఈయన మృతదేహానికి రిటైర్డ్ డీఈఓ నాగమునిరెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకులు కృష్ణప్రసాద్, రామానుజుల రెడ్డి, సుబ్బారెడ్డిలు నివాళులర్పించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

జమ్మలమడుగు : తుఫాన్ కారణంగా పొలాలకు వెళ్లే రైతులు వ్యవసాయ మోటార్ల వద్ద, విద్యుత్ తీగల వద్ద అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఏఈ రాజాబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం రాయలసీమ ప్రాంతంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయంటూ వాతావరణశాఖ ఇప్పటికే ప్రకటించింది. వర్షాలు పడి రైతుల స్టాటర్ డబ్బా, సర్వీసు వైర్లు తడిసిపోతుంటాయి. వాటిని ముట్టుకుని ప్రమాదాలకు గురికావద్దు అంటూ సూచించారు. తడి చేతులతో స్టాటర్లు ముట్టుకోకూడదని సూచించారు. ఎక్కడైన విద్యుత్ తీగలు తెగి ఉంటే వెంటనే లైన్ మెన్‌కు, సబ్‌స్టేషన్‌కు, ఏఈకి, 1912 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

అనాథలకు, అంధులకు అన్నదానం


అనాథలకు భోజనం వడ్డిస్తున్న బాలవెంకటేష్

పులివెందుల : పట్టణంలో ఉన్న శ్రీ వీరనారాయణమ్మ అంధుల ఆశ్రమం, లింగాలలోని దీనబంధు ఆశ్రమంలో ఆదివారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా బయమ్మ తోట సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ, దివ్యాంగుడు బి.బాలవెంకటేష్ పీఈటీ కొండారెడ్డి, వెంగల కొండారెడ్డి తన మిత్రుల సహాయ సహకారాలతో అంధులకు, అనాథలకు అన్నదాన కార్యక్రమంతోపాటు అవసరమైన బియ్యం, మంచాలను వితరణగా అందించారు. దివ్యాంగుడైన జనార్దన్‌రెడ్డి వారిని చేరదీసి మూడు పూటలా పౌష్టికాహారం అందించడం అభినందనీయమన్నారు.

జూదరులు అరెస్టు

చింతకొమ్మదిన్నె : మండలంలోని మద్దిమడుగు గ్రామ సమీపంలో జూదమాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి వారినుంచి రూ.8,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మండల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : పట్టణంలోని 11 కె.వి. బెస్తవారిపల్లె విద్యుత్ ఫీడర్, 11 కె.వి. ఇండస్ట్రియల్ ఫీడర్ కడప రోడ్డు నుంచి గురుకుల పాఠశాల, మెడికల్ కళాశాలలకు కొత్త విద్యుత్ లైన్ వేస్తున్న కారణంగా ఆయా ప్రాంతాలలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలన్నారు.

రాజుపాళెంకు చేరిన అయోధ్య అక్షింతలు

రాజుపాళెం : అయోధ్య శ్రీరాముని వద్ద పూజించిన అక్షింతలను ఆదివారం సాయంత్రం రాజుపాళెంలోని కోదండ రామాలయం వద్దకు తీసుకువచ్చారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శోభాయాత్ర పెద్ద సంఖ్యలో భజన సంకీర్తనలు, కోలాటాల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. రామ మందిరం జనవరిలో ప్రారంభోత్సవం జరుగుతున్నందున అక్కడ నుంచి అన్ని గ్రామాలకు అక్షింతలను పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు నాగార్జున రావు మాట్లాడుతూ రామాలయంలో ఉంచిన తార్వాత మండలంలో ప్రతి ఇంటింటికీ పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘటన కార్యదర్శి మల్లికార్జున రావు, బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు సహదేవరెడ్డి, శ్రీరాములు, సేవకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలోని భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యాదర్శి ఎల్.నాగ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 నుంచి ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్నటువంటి క్లెయిమ్ వెంటనే విడుదల చేయాలన్నారు. మరో పక్క కరోనా వచ్చి భవన నిర్మాణ రంగం కుదేలై, కార్మికుల కుటుంబాలు గడవక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికులను ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు.

బీటెక్ రవి.. అసత్య ఆరోపణలు మానుకోవాలి

వైఎస్సార్‌సీపీ మండల నాయకులు


చక్రాయపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల : టీడీపీ నాయకుడు బీటెక్ రవి అసత్య ఆరోపణలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ సింహాద్రిపురం మండల నాయకులు దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, బిదినంచర్ల బ్రహ్మానందరెడ్డిలు తెలిపారు. ఆదివారం ఒక ప్రకటనలో వారు తెలుపుతూ బీటెక్ రవి వైఎస్ కుటుంబాన్ని విమర్శించే స్థాయి లేదని.. అతనొక గల్లీ లీడర్ కూడా కాదన్నారు. తన సొంత గ్రామంలో సర్పంచ్‌గా కూడా గెలవలేని హీనచరిత్ర బీటెక్ రవిది అన్నారు. అలాంటి బీటెక్ రవి వైఎస్ కుటుంబంపైన తప్పుడు ఆరోపణలు చేయడం సిగ్గు చేటు అన్నారు.

బీటెక్ రవికి క్రికెట్ బెట్టింగ్, జూదాలు కొత్త కాదని.. అతను ఎలాంటి వాడో జిల్లా ప్రజలందరికి తెలుసు అన్నారు. బీటెక్ రవిని కేసుల పరంగానే పోలీసులు అదుపులోకి తీసుకుని మే జి స్ట్రేట్ ముందు హాజరుపరిచారన్నారు. అయితే బీ టెక్ రవి మాత్రం తనకు గంతలు కట్టి, పాయింట్ బ్లాక్‌లో గన్ పెట్టి బెదిరించారని అసత్య ఆరోపణలు చేయడం అతని నీచ చరిత్రకు నిదర్శనమన్నారు. ఇకనైనా ఇలాంటి దిగజారుడు మాటలు మానుకోకపోతే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వారు హితవు పలికారు.

వేములలో..

వేముల : స్థానిక వేముల మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు చల్లా గంగాదేవి ఆదివారం మాట్లాడుతూ బీటెక్ రవి శనివారం విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రిపై, వారి కుటుంబ సభ్యులపై లేనిపోని ఆరోపణలు చేయడం సిగ్గుచేటు అన్నారు. పులివెందుల ప్రాంత అభివృద్ధి చేసిన ఘనత వైఎస్ కుటుంబానికే దక్కుతుందని తెలిపారు. రాష్ట్రంలో జగన్‌కు ప్రజాధరణ చూసి ఓర్వలేకనే టీడీపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు.

చక్రాయపేటలో..

చక్రాయపేట : తెలుగుదేశం పార్టీ నేత బీటెక్ రవి నీ యొక్క నీచ చరిత్ర దేశమందరికీ తెలుసు నీకు వైఎస్ కుటుంభాన్ని విమర్శించే అర్హత లేదని ఆదివారం చక్రాయపేట, గండికొవ్వూరు, మారెళ్లమడక సర్పంచులు హర్షాద్, మోపూరి కిరణ్‌కుమార్‌రెడ్డి, నరసింహులు, మండల కోఆప్షన్ సభ్యుడు గౌస్‌లాదం, దళిత సంఘ నేతలు బాబు ఏసోబులు స్థానిక పార్టీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో మండిపడ్డారు.

పులివెందుల రూరల్..

పులివెందుల రూరల్ : పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రాష్ట్ర డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డి పులివెందులలోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీటెక్ రవి సీఎంపై, వారి కుటుంబ సభ్యులపై లేనిపోని ఆరోపణలు చేయడం సిగ్గు చేటు అన్నారు. ఒక కేసులో నిన్ను పోలీసులు అరెస్టు చేస్తే దాన్ని సీఎంపై మోపడం సిగ్గుచేటు అన్నారు.

వైఎస్సార్‌సీపీలో 40 కుటుంబాలు చేరిక


పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : పట్టణంలోని ప్రకాశ్‌నగర్ కాలనీ, ఇందిరమ్మ కాలనీలలో నివాసం ఉండే టీడీపీ, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దండె రవిప్రకాశ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం హర్షవర్ధన్‌రెడ్డిల సమక్షంలో 40 కుటుంబాలు ఆదివారం వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వీరందరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు డి.సూర్యానారాయణరెడ్డి, కె.వి.సుబ్బారెడ్డి, మహబూబ్ వలి తదితరులు పాల్గొన్నారు.

నేడు పొలతలలో మల్లేశ్వరస్వామి కల్యాణం

పెండ్లిమర్రి : పొలతల శైవ క్షేత్రంలోని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మూడవ కార్తీక సోమవారం సందర్భంగా సోమవారం ఉదయం 9.30 గంటలకు మల్లేశ్వరస్వామి, పార్వతిదేవి అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ నాగమల్లారెడ్డి, ఈఓ శ్రీనువాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. అనంతరం స్వామివారి ఊరేగింపు అక్కదేవతల గుడి వరకు నిర్వహిస్తామన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత


మృతుడి కుటుంబ సభ్యులకు బీమా అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చెన్నూరు : స్థానిక అరుంధతినగర్‌లో నివాసం ఉంటున్న చెప్పాలి చెప్పలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో మృతుని కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పథకం ద్వారా తక్షణ సహాయం కింద రూ. 10 వేలు ఆదివారం అందజేశారు. అలాగే రావలసిన లక్ష రూపాయలు ఆర్థిక సహాయం వారి కుటుంబానికి త్వరలోనే అందజేస్తామని ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్దిగారి వెంకటసుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ


ఆసుపత్రిలో పండ్లు బ్రెడ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కమలాపురం : స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నరేన్ యువసేన, నరేన్ టీం ఆధ్వర్యంలో సీకేదిన్నె జడ్పీటీసీ సభ్యుడు పి.నరేన్ రామాంజులరెడ్డి జన్మదినం సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు దాదాపు 180 మంది రక్తదానం చేశారు. అలాగే హార్టికల్చర్ స్టేట్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో అనాధ బాలుర ఛాత్రాలయంలో చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి, వారికి అల్పాహారం ఏర్పాటు చేశారు. పార్టీ కార్యాలయంలో మాజీ సర్పంచ్ శ్రీరాం రమణ ఆధ్వర్యంలో ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

మూడు రాష్ట్రాలలో బీజేపీ విజయంపై హర్షం

వేంపల్లె : నాలుగు రాష్ట్రాలలో జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలలో మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీష్‌ఘడ్‌లలో బీజేపీ విజయం సాధించడంపట్ల బీజేపీ నాయకులు గాలి హరిప్రసాద్, సునీల్ కుమార్, ప్రసాద్‌రెడ్డి, దొంతు సుమన్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం వేంపల్లెలోని బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చి స్వీట్లు పంచిపెట్టారు.

వచ్చే పార్లమెంటు ఎన్నికలలో బీ జేపీ హ్యాట్రిక్ విజయం సాధించి మోడి తిరిగి ప్ర ధాని అవుతారన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి కృషి చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఇన్సాఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ముస్లింలపై వివక్ష చూపుతోందన్నారు. సెక్యులర్ వ్యవస్థకు తూట్లు పొడుస్తూ తినే తిండిపైన, కట్టుకునే బట్టపైన ఆంక్షలు విధిస్తూ కామన్ సివిల్ కోడ్ తీసుకొచ్చి భయభ్రాంతులకు గురి చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మోదీ స్వదేశీ విధానం పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని పెట్టుబడిదారులు ఆదాని, అంబానీలకు ధారాదత్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు కేసీ బాదుల్లా, నాయకులు ఎస్.గౌస్, హుస్సేన్, ఇస్మాయిల్, ఫైరోజ్, మస్తాన్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన


ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

వేంపల్లె : మండల పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల జాబితాను ఆయా ప్రజాప్రతినిధులు, నాయకులు పరిశీలించారు. ఆదివారం మండలంలోని ఆయా పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలలో సచివాలయ సిబ్బంది ప్రదర్శించారు. ఎంపీటీసీ పరిధిలో ఉన్న ఓటర్లు ఉన్నవి లేనివి పరిశీలించి ఓటు లేని వారిని గుర్తించి వారికి సమాచారం అందించారు. తక్షణమే తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 9వ తేదీలోగా అందరూ తమ ఓటును నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ రవి శంకర్ గౌడ్, ఎంపీటీసీలు రాజ్‌కుమార్, కటిక చంద్రశేఖర్, బ్రహ్మయ్య, భారతి, మైనార్టీ ప్రధాన కార్యదర్శి నిస్సార్ బాష, సచివాలయ కన్వీనర్లు రమేష్‌బాబు, నరసింహ గౌడ్, నసీం బాష తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

వీరపునాయునిపల్లె : మండలంలోని ఇందుకూరు గ్రామ సచివాలయంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఏపీకి జ గన్ ఎందుకు కావాలి ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్ర నాథ్‌రెడ్డి హాజరు కానున్నట్లు మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు.

వైభవంగా లక్ష బిల్వార్చన


భానుకోట సోమేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

సింహాద్రిపురం : మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన భానుకోట సోమేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం భానుకోట సోమేశ్వరస్వామికి ఆలయ అర్చకులు బద్రిశర్మ, సురేష్‌శర్మలు లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మహా గణపతి పూజ, భగవత్ పున్యాహమ్, పంచగవ్య ప్రాశనం, మహాన్యాస ఏకదశ రుద్రాభిషేకం, మహా మంగళ హారతి తదితర పూజాది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

సంగమేశ్వరాలయంలో కార్తీక వనభోజనాలు


వనభోజన కార్యక్రమంలో ఏర్పాటు చేసిన కోలాటం

వీరపునాయునిపల్లె : మండల పరిధిలోని సంగమేశ్వరాయలంలో ఆదివారం రెడ్ల వనబోజన సమితి ఆధ్వర్యంలో కార్తీక వనభోజన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెడ్ల వనభోజన సమితి గౌరవ అధ్యక్షుడు డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్ల వనబోజన సమితి ఆధ్వర్యంలో పది సంవత్సరాలుగా కార్తీక వనబోజన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతోందని ఈ కార్యక్రమానికి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందజేసిన ఆలయ చైర్మన్ శివాంజనేయరెడ్డి, కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కోలాటం ఆకట్టుకుంది. మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తాడు లాగుడు పోటీలు, కుర్చీలాట నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న మహిళలకు బహుమతులు అందజేశారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక రమణప్ప సత్రంబడి ఉన్నత పాఠశాలలో ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1973–75 ఇంటర్ బైపీసీ, ఎంపీసీ విభాగాలకు చెందిన పూర్వపు విద్యార్థులు అపూర్వ సమ్మేళన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అంతకముసుపు పూర్వపు విద్యార్థులు వైఎస్ రవీంద్రనాథరెడ్డి, రామకృష్ణారెడ్డిలు జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థులు అప్పటి అధ్యాపకులు బాలచంద్రారెడ్డి, కృష్ణమూర్తి, ఆర్.వెంకటనారాయణలకు పుష్ప గుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అప్పటి అధ్యాపకుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ పూర్వపు విద్యార్థులందరూ కలిసికట్టుగా సమాజ సేవలో పాలు పంచుకోవాలని.. మొక్కలను బాగా పెంచాలని హితవు పలికారు. అనంతరం పూర్వపు విద్యార్థులు ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు, అప్పటి అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం


దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందిస్తున్న వికలాంగుల నెట్‌వర్క్ సభ్యులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక ముద్దనూరు రోడ్డులో ఉన్న వికలాంగుల కమ్యూనిటీ భవనంలో ఆదివారం ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఆ నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అంతకముసుపు లూయీ బ్రెయిలీ, హెలెన్ కెల్లర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దివ్యాంగులకు ఆర్‌సీడీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు వై.సురేంద్రారెడ్డి చేతులమీదుగా కృత్రిమ అవయవాలు, పోలియో క్యాలిఫర్స్, డిజిటల్ శ్రవణ యంత్రాలు, అంధుల చేతి కర్రలు, స్క్రీన్ రీడర్ మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌సీడీఎస్ కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సంయుక్త కార్యదర్శి సునీల్, ఆర్‌సీడీఎస్ యూత్ కన్వీనర్ జగదీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'శ్రీకృష్ణతులాభారం'తో ముత్తరాజుకు కీర్తి


ప్రముఖ రంగస్థల నటుడు నాగమునిని సత్కరిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు

కడప కల్చరల్ : శ్రీకృష్ణ, సత్యభామల మధ్య ఎన్నో ఆసక్తికరమైన సన్నివేశాలతో రచించిన నాటకం 'శ్రీకృష్ణతులాభారం' రచయిత ముత్తరాజు సుబ్బారావుకు తరగని కీర్తిని ఆర్జించి పెట్టిందని ప్రముఖ రంగస్థల నటుడు నాగముని పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, శ్రీ వెంకటేశ్వర సాంస్కృతిక మండలితో కలిసి ఆదివారం 'ముత్తరాజు సుబ్బారావు జీవితం –సాహిత్యం' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ముత్తరాజు సుబ్బారావు స్వగ్రామం, జీవిత విశేషాలు, రచయితగా ఆయన సాధించిన విజయాల గురించి వివరించారు. ఆయన రచించిన పలు పౌరాణిక నాటకాలు విశేష ప్రజాదరణ పొందాయన్నారు. చారిత్రక నాటకాలను కూడా రాశారన్నారు. 'శ్రీకృష్ణతులాభారం' నాటకం ప్రజల మనసుల్లో బాగా నాటుకుందని, అందువల్లనే ఆ కథను మూడుసార్లు సినిమాగా తీసినప్పటికీ సగానికి పైగా అందులోని పద్యాలను, పాటలను అలాగే ఉపయోగించుకోవడం విశేషమన్నారు. ఆ నాటకంతోపాటు 'కచ దేవయాని' అనే మరో పౌరాణిక నాటక విశిష్టతను విశ్లేషించారు. మరికొన్ని నాటకాల్లోని పాత్ర చిత్రణను, సంభాషణ చతురతను సోదాహరణంగా వివరించారు. కార్యక్రమ ప్రారంభంలో వక్త నాగమునిని బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాదరెడ్డి, సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథపాలకులు ఎస్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకటరమణ తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ఎం.మౌనిక, డాక్టర్ వెల్లాల వేంకటేశ్వరాచారి, కొత్తపల్లె రామాంజనేయులు, ఎస్.నాగన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుల సంబరాలు

పులివెందుల రూరల్ : తెలంగాణ రాష్ట్ర ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేలూరు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు.

వనాలకు వెళదాం.. భోజనం చేద్దాం

- ఐక్యత, ఆత్మీయత పెంచే వనభోజనాలు
- జిల్లాలో కార్తీక వన భోజనాలకు అనువైన ప్రాంతాలు

కడప కల్చరల్ : వైష్ణవులకు శ్రావణమాసం ఎంత ముఖ్యమో, శైవులకు కార్తీకం అంతే ముఖ్యం. కార్తీకానికి మరో విశిష్టత కూడా ఉంది. ఈ మాసంలో వైష్ణవ ఆలయాలలో కూడా పూజలు, వ్రతాలు నిర్వహిస్తారు. కార్తీక మాసం పేరు వినగానే వన భోజనాల మాట గుర్తుకు వస్తుంది. మొన్నటి వరకు ఈ మాసంలో కార్తీక వన భోజనాలను ఎక్కువగా నిర్వహించేవారు. కానీ ఇటీవల కాలంలో ఎందుకో గానీ ఆ జోరు తగ్గింది. మళ్లీ ఇప్పుడు వన భోజనాల ప్రాముఖ్యతను గుర్తించిన ప్రజలు కుల సంఘాలు, కాలనీ వాసులు బృందాలుగా వన భోజనాలకు తరలి వెళుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఊరి బయట ఆరుబయళ్లలో, మామిడి తోటల్లో ఆనందంగా గడుపుతున్నారు. జిల్లాలో వన భోజనాలకు అనువైన కొన్ని ప్రాంతాల గురించి తెలుసుకుందాం.

పుష్పగిరి

శివకేశవుల ఆలయాలు ఒకే ప్రాంగణంలో ఉన్న ఈ క్షేత్రం పెన్నానది ఒడ్డున ఉండడంతో కార్తీక మాసమంతా భక్తులతో కిటకిటలాడుతోంది. కడప నగరానికి సమీపంలో ఉండడంతో నగర వాసులు కూడా పెద్ద సంఖ్యలో ఈ క్షేత్రానికి వస్తారు. ఆలయం చుట్టుపక్కల విశాలమైన ప్రాంతాలు ఉండడంతో.. ఎక్కువగా కుల సంఘాలు, బ్రాహ్మణ సంఘాలు వన భోజనాలు నిర్వహిస్తుంటారు.

వేంపల్లె గండి

జిల్లాలోని వేంపల్లె గండి క్షేత్రంలో కూడా వన భోజనాలు ఎక్కువగా కార్తీక మాసమంతా నిర్వహిస్తుంటారు. నిజానికి ఇది వైష్ణవ క్షేత్రమే అయినా పాపాఘ్ని నది, విశాలమైన ఆరుబయలు, చుట్టూ కొండలు, ఆశ్రమాలు ఉండడంతో సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు ఈ మాసంలో కార్తీక వన భోజనాలను నిర్వహిస్తుంటారు.

కపర్థీశ్వరస్వామి కోన


సిద్దవటానికి రెండున్నర కిలోమీటర్ల దూరంలో లంకమల అభయారణ్యంలో కొండ కోనల మధ్య వెలిసిన కపర్థీశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారాలు భక్తులు కడప, బద్వేలు, అట్లూరు, సిద్దవటం ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి నోములు, పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకుంటారు. అనంతరం వన భోజన కార్యక్రమాలను చేపడతారు.


వేయి నూతుల కోన

కడప నగరం నుంచి పెండ్లిమర్రి వైపు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ క్షేత్రం కొండల మధ్య కోనలో ఉంది. ఇక్కడి లక్ష్మీనరసింహాస్వామి కార్తీక మాసంలో భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని పూజలు నిర్వహించడం విశేషం. కోనేరు, భారీ వృక్షాలు, పిల్ల కాలువలు ఉండడంతో ఈ క్షేత్రానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు.

సిద్దవటం కోట

సిద్దవటం కోట పెన్నానది తీరంలో ఉండడం, కోటలో పచ్చిక బయళ్లు ఉండడంతో సాధారణంగా కోటను చూసే వారే గాక కార్తీక సోమవారాల్లో ఈ నదిలో స్నానం చేసేందుకు కోటకు వస్తుంటారు. కార్తీక సోమవారాలలో సమీప ప్రాంతాల ప్రజలు వన భోజనాలకు ఈ కోటకే వస్తుంటారు.


పుష్పగిరి


వేయి నూతుల కోన